

సేనాధిపతి విష్వక్సేనుడి వాహనం వద్ద జీయంగార్లు, తితిదే ఈవో జె.శ్యామల రావు దంపతులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి దంపతులు, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, రామకృష్ణదీక్షితులు, కంకణ భట్టాచార్యులు గోవిందాచార్యులు తదితరులు

మాడవీధుల్లో సేనాధిపతి ప్రదక్షిణ

తిరుమల, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాలకు తితిదే గురువారం అంకురార్పణ చేసింది. వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా అంకురార్పణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను శ్రీవారి సేనాధిపతి శ్రీవిష్వక్సేనుడు సమీక్షించారు. శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలను ధరించి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాల భేరీ నినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో ఊరేగి పర్యవేక్షించారు. తిరుమల మొత్తం రాత్రివేళల్లో దేదీప్యమానంగా దేవతా ప్రతిమలతో వెలుగులీనుతూ భక్తులను అలరిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫాగ్ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. ఈ ప్రదేశంలో ప్రత్యేకమైన స్క్రీన్ వెనుక దేవతామూర్తుల విగ్రహాలు వస్తుంటాయి. ఆ ప్రదేశంలో భక్తులు తమ ఫోన్‌లో ఫొటోలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. కార్పెట్ స్క్రీన్‌లను మొదటిసారిగా ఏర్పాటుచేశారు.



తిరుచ్చిపై శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు

మలయప్పస్వామి దర్శనం..
యజ్ఞయాగాదుల పుణ్యం



ఈనాడు-తిరుపతి; న్యూస్‌టుడే, తిరుమల: శ్రీవారిని దర్శించుకున్న వారికి యజ్ఞయాగాదులు చేసిన పుణ్యం కలుగుతుందని శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారని, వాటి విశిష్టతను వివరించారు.

- వైకుంఠంలో తల్పమైన శేషుడిపై స్వామి అనుగ్రహంతో మొదటి రోజు పెద్ద శేషవాహనంగా మాడవీధుల్లో శ్రీమలయప్పస్వామి విహరిస్తారు.
- వాసుకీని అనుగ్రహిస్తూ చిన్నశేష వాహనంపై స్వామి భక్తులను కటాక్షిస్తారు.
- పౌరుషానికి ప్రతీకైన సింహాన్ని వాహనంగా మలుచుకున్నారు.
- పాలను, నీళ్లను వేరు చేసే శక్తి హంసకు ఉంది. మనలోని చెడు ఆలోచనలను వేరుచేసి స్వామి అనుగ్రహం పొందడానికి హంస వాహనాన్ని అధిరోహిస్తారు.
- రామావతారంలో ఎనలేని సేవ చేసిన హనుమంతుని వాహనంగా శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆరో రోజున భక్తులను అనుగ్రహిస్తారు.
- స్వామివారికి సూర్య చంద్రులు నేత్రాలుగా ఉంటారు. ఈ సృష్టికి మూలం సూర్యుడు, చంద్రుడు. అలాంటి వారే స్వామికి సేవకులుగా ఉన్నారంటే శ్రీమహావిష్ణువు ఎంత శక్తిమంతులో అర్థమవుతోంది.
- మహారథోత్సవంలో స్వామిని దర్శించుకున్న వారికి పునర్జన్మ ఉండదని శాస్త్రాలు చెబుతున్నాయి.
- కలియుగాంతంలో ప్రజలను రక్షించనున్న కల్కిగా చివరి రోజున అశ్వ వాహనంపై శ్రీమలయప్పస్వామి కరుణిస్తారు.



గరుడసేవ ప్రత్యేకం.. గరుత్మంతుడు స్వామివారిని నిత్యం కొలుస్తారు. ఎక్కడికైనా ఆఘమేఘాలపై చేరుస్తారు. అలాంటి గరుత్మంతుడిని తన వాహనంగా ఉపయోగించుకున్నారు. ప్రతి వైష్ణవ ఆలయంలోనూ స్వామికి ఎదురుగా గరుత్మంతుడు ఉంటారు. ఏడాదిలో గరుడ సేవ రోజు మాత్రమే మూలవిరాట్టుకు ఉన్న ఆభరణాలను బయటకు తెచ్చి అలంకరిస్తారు.

స్నపన తిరుమంజనం: సంప్రదాయం ప్రకారం మూడు రోజులపాటు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. స్వామివారిని ఉపచారాల తర్వాత మాలలతో అలంకరిస్తారు. చివరిగా శ్రీభూవరాహస్వామి ముఖ మండపం వద్ద చక్రస్నాన మహోత్సవంలో భాగంగా ఉభయదేవేరులతో శ్రీవారికి, చక్రత్తాళ్వారులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.



తెలుసుకోండి..
బ్రహ్మోత్సవాలు కనరండి

అదనంగా సమాచార కేంద్రాలు ఏర్పాటు చేసిన తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. శ్రీవారి దర్శనం, వసతి, అన్నప్రసాదం, లడ్డూ కౌంటర్లు, వాహన సేవలు, స్థానిక ఆలయాలు, రవాణా వసతులపై సమాచారం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో తితిదే ఆధ్వర్యంలో ఐదు సమాచార కేంద్రాలు, అదనంగా మరో ఏడు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారు. తిరుమలలోని జీఎన్‌సీ, సీఆర్వో, ప్రధాన కల్యాణకట్ట, భజనమందిరం, ఏటీసీ సమాచార కేంద్రాలతోపాటు అదనంగా పీఏసీ2, వీజీవో కార్యాలయ సమీపంలో, రాంభగీచా అతిథిగృహం, మ్యూజియం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా తితిదేకు సంబంధించిన సమాచారాన్ని కరపత్రాల్లో ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార కేంద్ర సిబ్బంది భక్తులు మాట్లాడే భాషలోనే వారికి సమాచారం అందిస్తారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షించనున్నారు.

చిన్నారులు, వృద్ధులకు జియో ట్యాగింగ్

తితిదే భద్రతా, నిఘా విభాగం నుంచి 1,250 మంది, పోలీసు శాఖ నుంచి 3,900 మంది సిబ్బందిని నియమించారు. గరుడ సేవకు అదనంగా 1,200 మందితో భద్రత కల్పించనున్నారు. వృద్ధులు, చిన్నారులు తప్పిపోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జియోట్యాగింగ్ చేయనున్నారు. ఎవరైనా తప్పిపోయినా సకాలంలో గుర్తించే అవకాశం ఉంటుంది.

ప్రత్యేకంగా కాల్ సెంటర్

సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారు. భక్తులు భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొన్నప్పుడు టోల్ ఫ్రీ నంబరు 155257కు ఫిర్యాదు చేయవచ్చు. బ్రహ్మోత్సవాల సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. తమ సూచనలు, సలహాలను తితిదే మెయిల్ helpdesk.ttd@tirumala.orgకు పంపవచ్చు.


ట్రాఫిక్ నిబంధనలు

ట్యాక్సీలు, వాహనదారులను ఈ నెల 4 నుంచి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు, 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో జీఎన్‌సీ సర్కిల్ నుంచి తిరువెంకటపతం ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా పీఏసీ-111 కూడలిలో యాత్రికులను దించి తిరుపతి వెళ్లాలి. తిరుమల లోపలకు అనుమతించరు. 8న గరుడసేవ దృష్ట్యా 7వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 9వ తేదీ ఉదయం 9 గంటల వరకు తిరుమలకు ట్యాక్సీలు అనుమతించరు.

మెరుగైన వసతులు

అన్ని విభాగాల్లోనూ సేవల సంఖ్య పెంపు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తితిదే ఉన్నతాధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. 2023లో అధికమాసం కారణంగా సెప్టెంబర్, అక్టోబర్‌లో సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో గత బ్రహ్మోత్సవాలకు మిన్నగా భక్తుల కోసం తితిదే మెరుగైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. గత సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు కలిపి దాదాపు 11 లక్షలమంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.47.55 కోట్లు లభించాయి. లడ్డూలు 57,63,360 విక్రయించారు.











అడ్డంకులు తొలగించి..: తిరుమలలో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలను తిరుమల ట్రాఫిక్ పోలీసులు సురక్షితమైన ప్రాంతానికి తరలించారు. వీటిని బాంబ్ స్క్వాడ్ టీమ్‌లతో చెక్ చేయించారు.

	లడ్డూ కౌంటర్లు	శ్రీవారి సేవకులు	ఎల్ఈడీ తెరలు	సాంస్కృతిక బృందాలు	పారిశుద్ధ్య సిబ్బంది	పర్యవేక్షకులు	అన్నప్రసాదాలు	పులిహోర	పాలు	గ్యాలరీల్లో మరుగుదొడ్లు
గతేడాది	54	3000	మూడు రోజులు	12 రాష్ట్రాలు	267	8 మంది	8.43 లక్షల మందికి	1.75 లక్షల మందికి	లక్ష మందికి	11
ప్రస్తుతం	65	4000	9 రోజులు	21 రాష్ట్రాలు	600	49 మంది	11.43 లక్షలమందికి	2 లక్షల మందికి	1.9 లక్షల మందికి	98

వారాహి సభలో.. ధర్మాగ్రహం

వైకాపా నేతలపై విరుచుకుపడిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారాహి బహిరంగ సభ విజయవంతంగా ముగిసింది. స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పులే కూడలిలో తన వారాహి డిక్లరేషన్ ప్రకటించారు. ఈ సమయంలో పవన్ కల్యాణ్ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. గుక్క తిప్పుకోకుండా సనాతన ధర్మం, వారాహి డిక్లరేషన్‌పై ఆంగ్లం, తమిళం, తెలుగులో మాట్లాడుతూనే మరోవైపు వైకాపా నేతలపై విరుచుకుపడ్డారు. తితిదే మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలపై విమర్శలు గుప్పించారు. వారి కారణంగానే నెయ్యిలో కల్తీ జరిగిందని మండిపడ్డారు. ధర్మారెడ్డి ఎక్కడ అంటూ గట్టిగా నిలదీశారు. ఆయన్ను వెతికి పట్టుకువస్తే మరిన్ని నిజాలు బయటకు వస్తాయన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, భాజపా అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, తెదేపా నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, శ్రీధర్‌వర్మ, జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, సుభాషిణి, రాజారెడ్డి పాల్గొన్నారు.



పవన్‌కల్యాణ్‌కు రాజదండం బహూకరిస్తున్న ← తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సభలో సెల్ఫీలు తీసుకుంటున్న అభిమానులు

చుడా ఇన్‌ఛార్జి వీసీగా జేసీకి బాధ్యతలు



జేసీ విద్యాధరి

చిత్తూరు నగరం: చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా) వైస్ ఛైర్మన్‌గా జేసీ విద్యాధరికి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ(పీకేఎం) వైస్ ఛైర్మన్‌గా అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు పూర్తి అదనపు బాధ్యతల్ని కేటాయించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్,^: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో, తహసీల్దార్లతో ఆమె మాట్లాడారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

అనూహ్యంగా పెరిగిన టమాటా ధర



పలమనేరు, న్యూస్‌టుడే: స్థానిక మార్కెట్‌లో గురువారం టమాటా ధరలు అనూహ్యంగా పెరిగాయి. 15 కిలోల బాక్సు ధర రూ. 850 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడంతో రైతులు సంతోషపడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి రైతులు పంటను మార్కెట్‌కు తెస్తున్నారు. దిగుబడి గణనీయంగా పడిపోయింది. సాధారణంగా రోజుకు వంద టన్నులు రావాల్సి ఉండగా.. గురువారం 12 టన్నులు మాత్రమే వచ్చాయి. వీటి కోసం పోటీ పడటంతో మంచి ధరలు వచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

అయినోళ్ల పనా.. గంజాయి బ్యాచ్ అరాచకమా..?

- బాలిక హత్య కేసులో పోలీసుల మల్లగుల్లాలు
- 11 బృందాలు గాలిస్తున్నా కనిపించని పురోగతి
- పోస్టుమార్టం నివేదిక వస్తేనే దర్యాప్తులో వేగం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏడేళ్ల బాలిక అస్పియా అంజుమ్ హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. 11 బృందాలు నాలుగు రోజులుగా పలు కోణాల్లో విచారించినా కీలక ఆధారాలు లభించలేదని ఆ వర్గాలే తలలు పట్టుకుంటున్నాయి. బాలిక అదృశ్యమైన తర్వాత ప్రాథమికంగా బాలిక తండ్రి ఫైనాన్స్ వ్యాపారం, లావాదేవీలు, వివాదాల నేపథ్యంలో విచారణ జరిగింది. బాలిక ఎస్ఎస్ ట్యాంకులో మృతదేహమై కనిపించిన తర్వాత ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ ప్రమేయంపై అనుమానంతో పలువురిని విచారించారు. అందులో కేసు మలుపు తిప్పే ఆధారాలేవి లభించలేదని తెలిసింది.

తండ్రి వాంగ్మూలం, కాల్‌డేటా విశ్లేషణ

బాలిక అదృశ్యం కేసును సవాల్‌గా స్వీకరించిన ఎస్పీ మణికంఠ విచారణకు యుద్ధప్రతిపాదికన డీఎస్పీలు సాయినాథ్, ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐతో 11 బృందాలు ఏర్పాటు చేశారు. ఆయనే రెండు రోజుల పాటు అక్కడే మకాం వేసి బృందాలకు దిశానిర్దేశం చేశారు. డీఐజీ సైతం పర్యటించి దర్యాప్తులో పలు సూచనలు చేశారు. ఇంతా చేసినా పాప ప్రాణాలు కాపాడలేకపోయారు. విచారణ అంతా బాలిక తండ్రి ఫైనాన్స్ వ్యాపారి కావడంతో.. ఆర్థిక లావాదేవీలు, వివాదాల నేపథ్యంలోనే విచారణ చేపట్టారు. అతని నుంచి వాంగ్మూలం, అనుమానితుల పేర్లు తెలుసుకుని వారి కదలికలు, కాల్‌డేటా విశ్లేషించారు. ముగ్గురు మహిళలు, బంధువులతో పాటు కొందరు అనుమానితులను నేరుగా తీసుకొచ్చి తమదైన శైలిలో విచారించారు. వారి ఇళ్లను జల్లెడ పట్టారు. అయినా ఎటువంటి ఫలితం కనిపించలేదు.

పీఎం నివేదికపైనే ఆశలు

ఈ క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ల్యాబ్ విశ్లేషణలపైనే ఆధారపడుతున్నారని తెలిసింది. పాపను చంపి తీసుకెళ్లి చెరువులో పడేశారా..? ప్రాణాలతోనే నీటిలో ముంచి హత్య చేశారా..? తెలిసిన వారు నమ్మించి తీసుకెళ్లి.. చెరువులో తోసేశారా.? ఆకతాయిలు మత్తులో ఆఘాయిత్యానికి పాల్పడి ఇలా చేశారా..? అనే కోణాల్లో బృందాలు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బాలిక శవమై తేలడంతో ఆ చుట్టపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. మొత్తానికి రెండు రోజుల్లో నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

ఆకతాయిల ఆగడాలపై అనుమానాలు

వైకాపా పాలనలో పోలీసుల ఉదాసీనత కారణంగా మారుమూల ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. అందులో భాగంగా పుంగనూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌ల కార్యకలాపాలు ఉన్నాయి. వీటిపై స్థానికులు, బాలిక బంధువుల నుంచి పోలీసులు పలు ఫిర్యాదులు వచ్చాయి. పట్టణానికి సమీపంలో కొందరు అనుమానితులు ఉన్నారని సమాచారం ఇచ్చారు. వారిని విచారించేందుకు వెళ్లిన పోలీసులకు అనూహ్యంగా పాప మృతదేహం ఎస్ఎస్ ట్యాంకులో కనిపించింది. ఊహించని పరిణామంతో పోలీసులు దర్యాప్తులో వేగం మందగించింది. పలువురు అనుమానితులను విచారించినా పురోగతి రాలేదని పోలీసు వర్గాల కథనం.

రబీ సేద్యం.. విత్తనం సిద్ధం

ఏపీసీడ్స్‌లో విత్తన విక్రయాలు



శేషమనాయుడు కండ్రిగ సమీపంలో దుక్కులు దున్నుతున్న రైతు



వరి వంగడాలను సంచులకు సిద్ధం చేస్తున్న హమాలీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రబీ దృష్ట్యా అవసరమైన వరి విత్తన రకాలను అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) సంసిద్ధమైంది. ఈ మేరకు సాధారణ విత్తన విక్రయాలు ప్రారంభించింది. ఏటా రబీ సీజన్‌లో సాధారణ విక్రయాలతో పాటు బైబ్యాక్ పద్ధతిలో రైతులకు విత్తన రకాలు అందజేయడం, విత్తనోత్పత్తి ద్వారా నాణ్యమైన ధ్రువీకరణ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం ప్రధాన లక్ష్యంగా విత్తనాభివృద్ధి సంస్థ ముందుకు సాగుతోంది.

జోరందుకున్న విక్రయం

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ కంటే రబీలో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఏటా అక్టోబరు మధ్య నుంచి డిసెంబరు వరకు వర్షాలు పడుతుంటాయి. ఈ కారణంగా బీళ్లుగా ఉన్న పొలాలను రైతులు సాగులోకి తీసుకువచ్చే సమయం ఇది. వర్షాలపై మిన్నంటిన ఆశలతో సాగు రైతులు అవసరమైన విత్తనాలను సంసిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఏపీసీడ్స్‌లో విత్తన విక్రయాలు జోరందుకున్నాయి. తెలుగుగంగ పరివాహక ప్రాంతంలో రైతులు పొలాలు దున్ని దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులందరికీ నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏపీసీడ్స్ సన్నద్ధమైంది.

సాధారణ రకాలకు సంబంధించి ఈ ఏడాది విత్తన ధరలు ఇలా..

వరి రకం	కిలోలు	ధర(రూ.)
బీపీటీ 5204	25	1045.00
ఆర్ఎన్ఆర్15048	25	1045.00
ఎన్ఎల్ఆర్ 33892	30	1134.00
ఎన్ఎల్ఆర్ 34449	30	1215.00
కేఎన్ఎం 1638	25	1012.50
ఎడీటీ 39	30	1014.00
ఎంటీయూ 1010	30	1110.00
జ్యోతి	30	1110.00
ఉమ	30	1110.00

విత్తనోత్పత్తి సన్నాహాలు..

రబీ సీజన్‌లో ఏపీసీడ్స్ విత్తనోత్పత్తి కింద వాటాదారులైన రైతులకు అవసరమైన వరి వంగడాలను బైబ్యాక్ పద్ధతిలో ఇచ్చేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. ఇక్కడి సంస్థలో వాటాదారులైన రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 15 నుంచి బీపీటీ-5204, ఎన్ఎల్ఆర్ 33892, కేఎన్ఎం1638, ఉమ, పొన్నీరు, ఏడీటీ 37, ఏడీటీ 39, ఎంటీయూ 1010, ఎంటీయూ 1224, ఎన్ఎల్ఆర్ 3449, జ్యోతి రకాలను ఇస్తాం. నవంబరు 15 నుంచి ఆర్ఎన్ఆర్ రకాన్ని అందుబాటులో ఉంచుతాం.
– సంపత్‌కుమార్, ఏపీసీడ్స్ జిల్లా మేనేజరు

భక్తులకు శఠగోపం.. దూరమైన వసతి

● బ్రహ్మోత్సవాల్లో డార్మిటరీల్లోనూ చోటు కష్టమే ● కానరాని గోవిందరాజ సత్రాల సేవలు



డార్మిటరీలో స్థలాభావంతో యాత్రికుల అగచాట్లు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారిని దర్శించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వచ్చే భక్తులు మొదటగా తిరుపతిలో అడుగిడుతారు. ఇక్కడ మొక్కరదరకు దొరికే గదులు, తాగునీరు, వసతి, కాలకృత్యాల కోసం ఏర్పాట్లు పెద్దఎత్తున అవసరం కాగా సరిపడా లేవనే చెప్పాలి. దేవస్థానం సముదాయాలు ముందస్తు కేటాయింపులకు, సిఫార్సులకు సరిపోతుండటంతో సామాన్య భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు.

● రైల్వే స్టేషన్ సమీపంలోనే గతంలో గోవిందరాజ స్వామి సత్రాలు భక్తుల అవసరాలకు ఎంతో అనువుగా ఉండేవి. కావలసినన్ని గదులు, తక్కువ అద్దెతో వాటిని నిరంతరం సద్వినియోగం చేసుకునేవారు. ఒకటో సత్రం స్థానంలో విష్ణు నివాసాన్ని నిర్మించారు. ఇక్కడ ఏసీ గదులు 196, ఎనిమిది నాన్ ఏసీ సూట్లు, నాన్ ఏసీ గదులు 196 మాత్రమే ఉన్నాయి. గదులు దొరకనివారికి ఇక్కడే 11 ఉచిత డార్మిటరీలు ఉన్నాయి. భక్తులందరూ సముదాయ వరండాల్లో సేదతీరాల్సి ఉంటుంది. 714 లాకర్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ పలు రైళ్లలో వచ్చే భక్తులు విష్ణు నివాసాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. అయితే ఇక్కడ గదులు దొరక్క, సరిపోని స్థాయిలో లాకర్లు లేక, డార్మిటరీలో కాసింత స్థలం దొరక్క, కష్టాలు ఎదుర్కొంటున్నారు.

ఆఘమేఘాల మీద కూల్చివేత

రైల్వే స్టేషన్ వెనుక భాగంలో గోవిందరాజ స్వామి సత్రాలు రెండు, మూడు 65 సంవత్సరాల పాటు భక్తుల సేవలో తరించాయి. సామాన్య భక్తులకు అందుబాటులో 950 గదులు ఉండేవి. వాటిని తమ స్వార్థం కోసం గత పాలకులు ఎన్నికల ముందు కూల్చివేయడంతో సామాన్య భక్తులు రోడ్డున పడ్డారు. రూ.418 కోట్లతో నూతన సత్రాలు నిర్మిస్తుండగా అదనంగా సౌకర్యాల కల్పన పేరుతో రూ.182 కోట్లు వెచ్చిస్తున్నారు. బాగున్న సత్రాలు కూల్చేసి భక్తుల సొమ్ము వృథా చేశారనే విమర్శలు అన్నివర్గాల్లోనూ ఉంది. ఇక్కడ నూతన సత్రాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

అక్కడ గదులు దొరకడం గగనమే..

శ్రీనివాసంలో మొత్తం 505 గదులు ఉండగా ఇందులో 382 నాన్ ఏసీ గదులున్నాయి. తక్కిన ఏసీ గదులన్నీ ఆన్‌లైన్ పద్ధతిలోనే ముందస్తుగా కేటాయిస్తారు. 9 డార్మిటరీలున్నాయి. గదులు దొరకని భక్తుల కోసం 1098 లాకర్లు ఏర్పాటు చేశారు. మాధవంలో గదులు ఉన్నప్పటికీ ఇక్కడ ఆన్‌లైన్ విధానం అమలవుతోంది. డార్మిటరీలు ఉన్నప్పటికీ సర్వదర్శన టోకెన్ల భక్తులు వేచి ఉండేందుకు సరిపోతున్నాయి. అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో గదుల కేటాయింపులు లేవు. ఇక్కడ ఒక డార్మిటరీ మాత్రమే ఉంది. వంద లాకర్లు ఉన్నాయి. వాటిని ఎక్కువగా పోలీసు విజిలెన్స్ విభాగంవారు వినియోగిస్తున్నారు. అలిపిరి లింకు బస్టాండ్ ప్రాంతంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ స్నానాలు, మలమూత్ర విసర్జనకు నిర్మాణాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయి.

● ఎస్వీ అతిథిగృహంలో 10 ఏసీ, 21 నాన్ ఏసీ గదులున్నా భక్తులకు అందడం లేదు. ప్రస్తుత కలెక్టరేట్‌ను గతంలో పద్మావతి నిలయంగా వ్యవహరించేవారు. ఇక్కడ పెద్దఎత్తున భక్తులకు ఏర్పాట్లు చేసే అవకాశం ఉన్నా గత ప్రభుత్వం కలెక్టరేట్ అవసరాలకు స్వాధీనం చేసుకోవడంతో భక్తులకు దూరమైంది.

చౌక దుకాణాల డీలర్ల భర్తీలో స్వల్ప మార్పు

20న నోటిఫికేషన్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలో చౌక దుకాణాల డీలర్ల పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను ఈ నెల 7 నుంచి 20వ తేదీకి మార్పు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. పునర్విభజన ప్రక్రియ ద్వారా 49 దుకాణాలు పెరగనున్నాయి. వివిధ కారణాలతో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 400 చౌక దుకాణాలు కొనసాగుతున్నాయి. 800 కార్డులు కన్నా అధికంగా ఉన్న చౌక దుకాణాలను పునర్విభజన చేపట్టారు. మొత్తం 449 చౌక దుకాణాల డీలర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 20న తేదీన నోటిఫికేషన్‌ను ఆయా డివిజన్ల ఆర్డీవోలు విడుదల చేయనున్నారు. డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబరు 5న రాత పరీక్ష, 7న మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. 10న ఎంపిక జాబితా ప్రకటిస్తారని తెలిపారు.

బస్‌పాస్‌ల రెన్యువల్ నిలిపివేత

పలమనేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఇస్తున్న బస్‌పాస్‌ల రెన్యువల్‌ను రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు పలమనేరు డీఎం టీకే స్వామి గురువారం తెలిపారు. సాంకేతిక ఇబ్బందుల కారణంగా వెబ్‌సైట్ ఆధునికీకరణ జరుగుతుందన్నారు. ఫలితంగా ఈనెల 5, 6 తేదీల్లో అన్ని రకాల బస్‌పాస్‌ల జారీ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఇతర వర్గాలు సహకరించాలని కోరారు. 7వ తేదీ నుంచి కౌంటర్ తిరిగి ప్రారంభిస్తామన్నారు.

5న ఉద్యోగ మేళా

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: ఈ నెల 5న చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రాజంపేట, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 1న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో చిత్తూరుకు చెందిన పి. సాయివెంకటశివ, పి. నాగూర్‌వల్లి ఉన్నారు.

నవోదయలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో తొమ్మిది, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దేవరాజు గురువారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోగా పంపించాలని, ఎంపిక పరీక్ష 2025 ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు చెప్పారు.

తోట్లచెరువు ఆక్రమణలు తొలగిస్తాం: కలెక్టరు



పీయం తండా గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, న్యూస్‌టుడే: మండలంలో పెద్దదైన తోట్ల చెరువులో ఆక్రమణలు తొలగించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం వారు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ననియాల ఏనుగుల సంరక్షణ కేంద్రం, ఎకో టూరిజం ప్రాజెక్టు పరిశీలించారు. అసంపూర్తి, నిర్మాణ దశలోని పనులను అటవీ శాఖాధికారులతో సమీక్షించారు. పీయం తండాలో పంద్యాలమడుగు, పల్లికుప్పం, తండాలో గ్రామస్థులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన దృష్టికి పలు సమస్యలు తెచ్చారు. తోట్ల చెరువు దురాక్రమణకు గురైందని, సర్వే చేసి తొలగించి బోటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పచ్చారమాకులపల్లిలో ప్రాథమిక పాఠశాల స్థలాన్ని స్థానికులు ఆక్రమించారని ఫిర్యాదు చేయగా పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాసరాజు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దారు బాబు, ఎఫ్ఆర్వో జయశంకర్, ఆంనదరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

భూఆక్రమణపై అధికార పార్టీ నేతల వాగ్వాదం



నేతలు, వారి అనుచరుల వాగ్వాదం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగర సమీపంలోని తిమ్మసముద్రం రెవెన్యూ పరిధి కోడిగుంట ఇందిరమ్మ కాలనీలోని ఖాళీ స్థలాల్ని అధికార పార్టీకి చెందిన నేత గురువారం జేసీబీలతో చదును చేయిస్తుంటే ప్రభుత్వ పీపీ వద్ద పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి, మరో వ్యక్తి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల సర్వేయరు కుషేంద్ర, వీఆర్వో శశికుమార్ ఘటన స్థలానికి వెళ్లి, సర్వే చేస్తే.. మహిళా ఉద్యోగికి ఏకంగా మూడు ప్లాట్లు కేటాయించిన విషయం బయటపడింది. విషయం తెలుసుకున్న 40వ వార్డుకు చెందిన తెదేపా మాజీ కార్పొరేటర్ కంద తన వార్డులో ఆ నేత దౌర్జన్యం ఏమిటని ఘటన స్థలానికి చేరుకొని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య మాటలయుద్ధం మొదలైంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు వారికి సర్దిచెప్పడంతో ఆ నేతలిద్దరూ అక్కడి నుంచి వెనుతిరిగారు. ఈ విషయంపై తహసీల్దారు కళావతిని వివరణ కోరగా.. స్వాతి, లోకేష్‌రెడ్డి పరస్పర ఫిర్యాదుల మేరకు సర్వే చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నేలపాలైన టమాటా తోటను చూపుతున్న బాధిత రైతులు రాజేంద్ర,హరి



టమాటా పంటను చూపుతున్న మహిళా రైతు సుందర

ఏనుగుల దాడిలో పంటలకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. కొన్ని రోజులుగా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోన్న గజరాజులు మరోసారి గురువారం తెల్లవారుజామున విరుచుకుపడ్డాయి. మామిడి, వరి, టమాటా పంటలకు నష్టం జరిగింది. పాళెం పంచాయతీ కోటపల్లెలో రైతులు హరి, రాజేంద్ర సాగు చేసిన టమాటా పంటను తొక్కి నాశనం చేశాయి. వెంకటముని, పురుషోత్తం ఇద్దరు రైతుల మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిచేశాయి. కల్లూరుకు చెందిన సయ్యద్‌బాషా అనే రైతు ఎకరా వరి పంటను తొక్కాయి. దేవళంపేట పంచాయతీ పెనుబాల ఎస్సీకాలనీకి చెందిన సుందర అనే మహిళా రైతు పొలంలోని ఒకటిన్నర ఎకరా టమాటా పంటకు నష్టం కలిగించాయి. అటవీశాఖ అధికారి మహమ్మద్‌షఫీపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఉద్యోగులు పరిసరాలపై నిఘా ఉంచండి: తితిదే ఈవో



మాట్లాడుతున్న తితిదే ఈవో జె.శ్యామలరావు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు విశేషమైన సేవలు అందించాలని, అదే సమయంలో పరిసరాలపై నిఘా ఉంచి సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని డిప్యూటేషన్ సిబ్బందికి తితిదే ఈవో జె. శ్యామలరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల విధులకు హాజరైన ఉద్యోగులను ఈవో, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి దిశానిర్దేశం చేశారు. పోలీసులు, జిల్లా యంత్రాంగం, తితిదే డిప్యూటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం అదనపు ఈవో, సీవీఎస్‌వో శ్రీధర్ గత బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యంగా గరుడసేవ రోజున ఉండే సమన్వయ సమస్యలు ఈసారి తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, ఇతర ఉన్నతాధికారులు, డిప్యూటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం



ఎస్వీసెట్‌లోకి పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో టెట్ గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. మొదటి రోజు జిల్లాలో రెండు కేంద్రాలు, చెన్నైలో ఒక కేంద్రంలో పరీక్ష జరిగింది. ఉదయం 260 మంది అభ్యర్థులకు గాను 227 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 232 మందికి గాను 208 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అందులో చెన్నై పరీక్ష కేంద్రంలో 28 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 19 మంది హాజరయ్యారు. మిగిలిన వారు జిల్లాలోని మదర్‌థెరిసా, ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాల్లో పరీక్ష రాశారు.

సరస్వతీదేవిగా మరగదాంబిక



కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీమరగదాంబికా సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం రాత్రి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఐరాలలోని పాలేటి గంగమ్మ స్వర్ణ కవచ అలంకారంలో అభమిచ్చారు.

చెన్నై వెళ్లి పింఛను అందజేత

నగరి, న్యూస్‌టుడే: స్థానిక ఇందిరానగర్‌కు చెందిన పింఛనుదారులు ఎ. ఎం. మాలిక్ అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. పింఛను అందించాలంటే అతని హాజరు తప్పనిసరిగా ఉండాలి, అతను రాలేని పరిస్థితిని మున్సిపల్ కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగి మురళి వివరించారు. ఆయన అనుమతితో చెన్నై వెళ్లి లబ్ధిదారునికి పింఛను సొమ్ము అందించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న లబ్ధిదారుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



జి.రక్షిత

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు మండలంలోని చంద్రమాకుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని జి. రక్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి గురువారం తెలిపారు. గత నెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 అమ్మాయిల ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె సత్తా చాటి ఛాంపియన్‌షిప్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 24 వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రక్షిత పాల్గొంటారని పీడీ మురళీధర్ తెలిపారు. ఆమెను అభినందించారు.

ఐరాలలో 120.8 మి.మీ వర్షం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి జిల్లాలోని 25 మండలాల్లో భారీ నుంచి తేలికపాటి వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల వర్షం కురవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా ఐరాల మండలంలో 120.8 మి.మీటర్లు కురవగా.. అత్యల్పంగా గంగాధరనెల్లూరులో 2.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వి.కోటలో 55.0 మి.మీటర్లు, బైరెడ్డిపల్లె 49.6, పూతలపట్టు 42.6, యాదమరి 39.2, తవణంపల్లె 36.4, చిత్తూరు 34.2, పుంగనూరు 32.4, బంగారుపాళ్యం 30.0, పెద్దపంజాణి, చౌడేపల్లె 28.6, శాంతిపురం 28.4, వెదురుకుప్పం 19.4, చిత్తూరు రూరల్ 14.8, రొంపిచెర్ల 14.2, రామకుప్పం 10.8 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో వాగులు, వంకలు ప్రవహించాయి.



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం

సీఎం ఆదేశాలతో బాధితులకు న్యాయం

పుంగనూరులో మహిళా కమిషన్ సభ్యురాలు

పుంగనూరు గ్రామీణ : 'ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరం.. విషాదకరం.. సీఎం ఆదేశాలతో బాధితులకు న్యాయం చేస్తా'మని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం పేర్కొన్నారు. గురువారం ఆమె పుంగనూరులో పర్యటించారు. అస్పియా అంజుమ్ (7) కిడ్నాప్, హత్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, సీఎం, హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి విచారణ వేగవంతం చేస్తామన్నారు. పోలీసులు 11 బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారని, వారు తీసుకుంటున్న చర్యలు వివరించారు. త్వరలో నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించేదే లేదని తెలిపారు. తెదేపా నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కవిత, బీజేపీ నాయకురాలు మల్లికరాణి, నాయకులు సీవీ. రెడ్డి, గిరి, సుషేల్‌బాష, డీఎస్పీ, సాయినాథ్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	113
రిటైల్	135
లేయర్	110
బ్రాయిలర్స్	196
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	223
లేయర్ మాంసం	187



మృతదేహాల కోసం చెరువు వద్ద గాలిస్తున్న కాలనీ వాసులు

ఈతకు వెళ్లి ఇద్దరు స్నేహితుల మృతి

మరొకరు క్షేమం.. ఇందిరమ్మ కాలనీలో విషాదం





ఇర్ఫాన్, తోహిద్ (పాతచిత్రాలు)

బంగారుపాళ్యం: చెరువులోకి ఈతకు వెళ్లి ఇద్దరు స్నేహితులు మృతిగా చెందగా.. మరో స్నేహితుడు సురక్షితంగా బయటపడిన ఘటన గురువారం మండలంలోని ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకుంది. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు.. తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇర్ఫాన్(16), తోహిద్(16), మరో బాలుడు తోహిద్ స్నేహితులు. ఇర్ఫాన్, తోహిద్‌లు చేతి వృత్తి పనులు చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నారు. ముగ్గురు స్నేహితులు కలిసి గురువారం సాయంత్రం మండలంలోని ఊటువంక చెరువులోకి ఈతకు వెళ్లారు. వీరికి ఈత సరిగా రాదు. ఇర్ఫాన్, తోహిద్‌లు చెరువు నీటిలోని మట్టిలో ఇరుక్కున్నారు. వీరిని రక్షించేందుకు గట్టుపై ఉన్న తోహిద్ ప్రయత్నించి విఫలమయ్యాడు. విషయాన్ని బాలుడు కాలనీవాసులకు తెలిపాడు. కుటుంబసభ్యులు, కాలనీవాసులు చెరువు వద్దకు చేరుకుని గాలించగా ఇర్ఫాన్ మృతదేహం దొరికింది. తోహిద్ ఆచూకీ లభించలేదు. పోలీసులు చిత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు చెరువులో గాలించి తోహిద్ మృతదేహాన్ని వెలికితీశారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో పెయింటర్ ఆత్మహత్య



సురేష్ (పాతచిత్రం)

నింద్ర, న్యూస్‌టుడే: అప్పుల బాధతో సురేష్(44) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నింద్ర మండలం కైపాకంకు చెందిన సురేష్ బుధవారం పెయింటింగ్ పనులకు వినియోగించే ఆయిల్‌ను తాగాడు. గమనించిన బాధితులు నగరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు నగరి రూరల్ సీఐ భాస్కర్ తెలిపారు.

చిత్తూరు
• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

లేఖ రచన పోటీలకు ఆహ్వానం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీల్ని నిర్వహించనున్నట్లు తపాలా శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్: ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై ఆంగ్లం/హిందీ/తెలుగు భాషలో రచన చేయాలన్నారు. 18 ఏళ్లలోపు వారికి, 18 ఏళ్లు పైబడిన వారికి వేర్వేరుగా.. ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్ కేటగిరీ, ఎన్వలప్ కేటగిరీలో పోటీలు ఉంటాయన్నారు. లేఖలను ఈ ఏడాది డిసెంబరు 14 లోగా చిత్తూరు ప్రధాన తపాలా కార్యాలయానికి పంపాలని ఆయన పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుడిపాల, న్యూస్‌టుడే: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్, ఎంపీపీ కార్యాలయ ఆవరణలో వ్యర్థాలను తొలగించారు. మానవ హారం, ర్యాలీ నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ తదితరులు పాల్గొన్నారు. **కార్వేటినగరం:** పరిసరాల శుభ్రతతోనే ప్రగతి సాధ్యమవుతుందని సర్పంచి శేఖర్ అన్నారు. మండలంలోని కేపీ అగ్రహారంలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఈవో గురుప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ మణికంఠ

సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలు విజయవంతం

కాణిపాకం: సమష్టి కృషితో వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు, ప్రత్యేకోత్సవాలు విజయవంతమైనట్లు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తెలిపారు. ఆలయ అన్నదానమండపంలో బ్రహ్మోత్సవ విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని గురువారం సన్మానించారు. జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ, ఆలయ ఈవో పి.గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచి మధుసూదనరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో సకాలంలో వర్షాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: మొక్కల పెంపకంతో సకాలంలో వర్షాలు కురిసి భూగర్భ జలాల వృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద గురువారం మొక్కలు నాటారు. ఆలయ ఈవో పి.గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, మాజీ ఛైర్మన్ మణినాయుడు ఉన్నారు.

ఇన్‌ఛార్జి ఏడీగా వేణుగోపాల్

చిత్తూరు(వ్యవసాయం): వ్యవసాయ శాఖ చిత్తూరు డివిజన్ ఇన్‌ఛార్జి ఏడీగా వేణుగోపాల్ నియమితులయ్యారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న ఉమ వ్యక్తిగత అవసరాల నిమిత్తం నెల రోజులు సెలవుపై వెళ్లారు. దీంతో చిత్తూరు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్‌కు ఏడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు.

గత ఐదేళ్లు అలంకారప్రాయంగా మార్కెట్ కమిటీలు

వసూళ్లతో సరి.. సేవలు నాస్తి



ఆగిపోయిన మంగసముద్రం నూతన మార్కెట్ యార్డు పనులు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ కమిటీలు వైకాపా ప్రభుత్వంలో నిర్వీర్యమయ్యాయి. పంట ఉత్పత్తులపై ఒక శాతం సెస్ రూపంలో వసూలు చేసే ఈ కమిటీలు అయిదేళ్లుగా రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. కొన్ని ప్రాంతాల్లో అవగాహన లేని వారికి పదవులు కట్టబెట్టడంతో ఆర్థిక పరిస్థితి దిగజారి.. అంతర్గత రోడ్లు, పశువైద్య శిబిరాలు, రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేని దుస్థితి నెలకొంది. చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లోని చిత్తూరు, బంగారుపాళ్యం, నగరి, వేపంజేరి, ఎస్ఆర్‌పురం, నగరి కమిటీల్లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప..ఒక్క పైసా నిధులు విడుదల కాలేదు. ఒక్క అభివృద్ధి పని జరిగిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మార్కెట్ కమిటీలకు పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

ఐదేళ్లుగా కదలని మంగసముద్రం యార్డు పనులు

తెదేపా హయాంలో మంగసముద్రం వద్ద నూతన యార్డు నిర్మాణానికి రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఆర్‌డీఎఫ్) కింద రూ.10.50కోట్లు మంజూరయ్యాయి. 2019లో పనులు ప్రారంభించారు. ఒకే ప్రాంగణంలో 40 బెల్లం మండీలు, 35 మామిడి మండీల నిర్మాణం సహా రైతులు, వ్యాపారులు, కూలీల సౌకర్యార్థం మౌలిక వసతుల నిర్మాణం చేపట్టారు. వైకాపా ప్రభుత్వం రాగానే పనులు నిలిచాయి. ఐదేళ్లుగా పనుల్లో పురోగతి శూన్యం.

కలగానే ఐరాలలో ఉప మార్కెట్ యార్డు

బంగారుపాళ్యం మార్కెట్ కమిటీకి అనుసంధానంగా ఐరాలలో ఉప మార్కెట్ యార్డు నిర్మాణానికి తెదేపా పాలనలో శ్రీకారం చుట్టారు. వైకాపా పాలనలో ఉప మార్కెట్ యార్డు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అలాగే బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో వాణిజ్య సముదాయం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. కమిటీ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు.

ప్రతిపాదనల్లోనే వేపంజేరి కమిటీలో పనులు

వేపంజేరి మార్కెట్ యార్డుకు సంబంధించి పెనుమూరులోని మార్కెట్ యార్డులో ప్రహరీ నిర్మాణం, మామిడి మండీల నిర్మాణ పనులు ప్రతిపాదన దశలోనే ఆగాయి. రూ.లక్షల వ్యయ అంచనాలతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ..కార్యరూపం దాల్చలేదు.

గోదాములోనే నగరి కార్యాలయం..

నగరి మార్కెట్ కమిటీ కార్యాలయం వర్షానికి ఉరుస్తుండటం...ఎప్పుడు కూలిపోతుందోనని భయంతో ఈ కార్యాలయాన్ని గోదాములో నిర్వహిస్తున్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.20లక్షలతో ప్రతిపాదనలు పంపినా..వైకాపా ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు. నూతన కార్యాలయ భవన నిర్మాణం గాలికొదిలేశారు. గోదాము మరమ్మతుకు రూ.6 లక్షల వ్యయ అంచనాల ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమయ్యాయి.

అద్దె భవనంలోనే.. ఎస్ఆర్‌పురం కమిటీ కార్యాలయం

ఎస్ఆర్‌పురం మార్కెట్ కమిటీకి కార్యాలయమే లేదు. అద్దె భవనంలో కొనసాగుతోంది. నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.కోటి నిధులు ఇస్తామని ప్రకటించినప్పటికీ..కార్యాలయ భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. స్థల వివాదం కారణంగా పనులు చేపట్టలేదని ఇంజినీర్లు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

నిధులు మంజూరు కాకపోవడంతో కమిటీల్లో అభివృద్ధి పనులు ఆగాయి. మార్కెట్ కమిటీల్లో పలు అభివృద్ధి పనులకు వ్యయ అంచనాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. నిధులు రాగానే పనులు చేపట్టి పూర్తిచేస్తాం.

-పరమేశ్వరన్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

పుత్తూరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని ఆనంబట్టు రోడ్డులో చెత్తకుండీలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.

- ఆనంద్, గేటుపుత్తూరు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో రోజూ చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్

వెదురుకుప్పం, న్యూస్‌టుడే:

సమస్య: మండల పరిధి పచ్చికాపల్లం పంచాయతీ కేంద్రంలో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

- శేఖర్, స్థానికుడు

సమాధానం: పంచాయతీ పాలకులతో మాట్లాడాం. చెత్తాచెదారాలు తొలగించేలా చూస్తాం.

- మోహన్‌కుమార్, డీడీవో

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక దొడ్డిపల్లిలో నివాసాల మధ్య కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. -కాలనీవాసులు

సమాధానం: పూడికతీత పనులు చేపడతాం. -అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

పైపులైను మరమ్మతు

స్పందనకు వందనం

పాలసముద్రం, న్యూస్‌టుడే: వెంగళరాజు కుప్ప పంచాయతీ కొత్తూరు గ్రామంలో మరమ్మతుకు గురైన తాగునీటి పైపులైనును సరిచేయించారు. పైపులైను లీకేజీపై గురువారం 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో విద్యావతి మరమ్మతు చేయించారు.

వృద్ధులకు చీరల పంపిణీ

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణానికి చెందిన సీఎస్ బాబు 7వ వర్ధంతిని ఆయన తనయుడు సీఎం దిలీప్ మొదలియార్ స్థానిక మదర్ ఇండియా వృద్ధాశ్రమంలో నిర్వహించారు. సీఎస్ బాబు గురువారం వృద్ధులకు చీరలు, బిర్యానీ అందజేశారు. మిత్రులు మనోహర్ రెడ్డి, కుట్టి, చిన్న, శివ, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు, బిర్యానీ పంపిణీ చేస్తున్న దిలీప్ మొదలియార్

మహాసభల్ని విజయవంతం చేయండి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సీపీఎం 14వ జిల్లా మహాసభల్ని ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడగంగరాజు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మహాసభల కరపత్రాల్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభల విజయవంతానికి సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని, జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు సురేంద్ర, జ్యోతి, దాస్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



పూజలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దంపతులు

నవచండీ యాగం

చిత్తూరు(సంతపేట): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం నవచండీ యాగం గురువారం ప్రారంభమైంది. స్థానిక సంతపేటలోని సుఖీభవ హాల్‌లో వేద పండితులు బాలకృష్ణ గురూజీ నేతృత్వంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక అలంకరణ, అర్చన, పూజాది క్రతువులు నిర్వహించారు. మేయర్ అముద, నగర కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మి ఆలయంలో అంకురార్పణ

నింద్ర, న్యూస్‌టుడే: నింద్ర మండల పరిధిలోని కేఆర్‌పాళెంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి ఆలయంలో గురువారం నుంచి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రూపేష్ కృష్ణ ఆచార్యులు, పుండరిక, వరదానందాచార్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు నగరంలోని ఆలయాల్లో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో మహాచండీ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం అమ్మవారి మూలవర్లకు 1,008 బిందెలతో జలాభిషేక సేవను నిర్వహించారు. తెదేపా నాయకులు గురజాల చెన్నకేశవులునాయుడు, విశ్వనాథ్ పాల్గొన్నారు.



కట్టమంచిలో బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరణ

ప్రసన్న పార్వతీదేవికి పుష్పాలంకరణ సేవ

పెనుమూరు, న్యూస్‌టుడే: సి.రామాపురంలో వెలసిన శ్రీప్రసన్న పార్వతీదేవి గురువారం రాత్రి పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అర్చకులు శివయ్యశాస్త్రి, ధ్రువంత్‌శర్మ అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. పూజలకు పంటపల్లెకు చెందిన సుధాకరనాయుడు, రాజగోపాల్‌నాయుడు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.



ఆధ్యాత్మికం

వడమాలపేట, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి బాలత్రిపుర సుందరి రూపంలో, తట్నేరిలోని శివాలయంలో స్వర్ణకవచ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు →

ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు

పుత్తూరు: పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లోని నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో, శ్రీద్రౌపదిదేవి అమ్మవారు జగన్మాతదేవిగా, గ్రామదేవత ఆరేటమ్మ కామాక్షీదేవి అలంకరణలో, శ్రీ కామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరాలయంలో అమ్మవారు కామాక్షీదేవి అలంకరణలో, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి దీక్షాబంధన అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాచపాలెంలోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు స్వర్ణ కవచదేవి అలంకరణ చేశారు.



బాలత్రిపురసుందరి దేవిగా మానసదేవి

అన్నపూర్ణాదేవికి పూజలు

తవణంపల్లె, న్యూస్‌టుడే: దిగువమాఘంలోని శివాలయంలో అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

గాయత్రీ దేవిగా బోయకొండ గంగమ్మ

బంగారుపాళ్యం: మండలంలోని వజ్రాపురం బోయకొండ గంగమ్మ గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో గణపతి హోమం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. ఉత్సవానికి ఉభయదారులుగా ఆలయధర్మకర్త రాధమ్మక్రిష్ణప్ప కుటుంబసభ్యులు గోపీ, నరేష్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, శివలింగయ్య, రాజేంద్రనాయుడు, రామమూర్తి, ఆలయ మేనేజర్ మొగిలప్ప తదితరులు భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు.



వరి పంట నష్టం

ఐరాల, న్యూస్‌టుడే: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి యర్లంపల్లెకు చెందిన హేమనాథ రెడ్డి రెండు ఎకరాల వరి పంట నేలకొరిగింది. నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతి

వడమాలపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని మహిళ(35) రైలు కింద పడి మృతి చెందిన సంఘటన పూడి-రేణిగుంట రైలు పట్టాలపై గురువారం జరిగింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రేణిగుంట రైల్వే ఎస్సై రవి తెలిపారు.

వాహనం ఢీకొని తమిళనాడు వాసి..

నింద్ర, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా వెళ్లాతుకోట్టైకు చెందిన అనంతవర్మ(52) మృతిచెందాడు. నింద్ర మండల పరిధిలోని సరస్వతీ కాటన్ మిల్లు సమీపంలోని నగరి-నాగలాపురం రోడ్డులో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు నగరి రూరల్ సీఐ భాస్కర్ తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడికి తప్పిన ప్రమాదం

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా చిత్తూరులో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరై తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ త్రుటిలో పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. బుధవారం చిత్తూరులో పార్టీ కార్యక్రమాలకు హాజరై తిరిగి బెంగళూరుకు కారులో వెళుతుండగా మార్గమధ్యలో కర్ణాటక రాష్ట్రం కోలారు సమీపంలో ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. అర్ధరాత్రి సమయంలో ప్రమాద ఘటన నుంచి తేరుకొని తనతో పాటు బెంగళూరులో ఉంటున్న వెదురుకుప్పం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమేష్‌కు సమాచారం అందించడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సీటు బెల్టు ధరించడం వల్లే ప్రాణాలతో బయట పడినట్లు భాస్కర్ తెలిపారు.

మద్యం స్వాధీనం

పుత్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గాంధీజయంతి రోజున బుధవారం రాత్రి మద్యం అమ్మకాలు చేపడుతున్న మునస్వామిని అరెస్టు చేసి.. అతని నుంచి 31 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ తెలిపారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: నగరంలోని భరత్‌నగర్ వద్ద అక్రమంగా సారా విక్రయిస్తున్న విజయరాజ్, ఆరోన్, హస్మన్ అలీఖాన్‌లను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ సీఐ జయరామయ్య తన బృందంతో గురువారం బండపల్లి సమీపంలోని భరత్‌నగర్ కాలనీ వద్ద తనిఖీలు చేపట్టారు.

గాలివానకు కూలిన టవర్

యాదమరి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తహసీల్దారు కార్యాలయంపై నిరుపయోగంగా ఉన్న అంతర్జాల టవర్ కూలిపోయింది. పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం

నగరి, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ఆంధ్రుల కర్తవ్యమని రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డా.టి.జనార్దన్ అన్నారు. నగరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు షబ్బీర్ బాషా, ఏఐవైఎఫ్ కార్యదర్శి విజయన్, మురళి, శేఖర్, సతీష్, మునిరాజ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్‌లో 18 మద్యం దుకాణాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో 18 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు ఆ శాఖ సీఐ మురళీమోహన్ పేర్కొన్నారు. పుత్తూరు ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుత్తూరులో 7 దుకాణాలు, నారాయణవనంలో 3, రామచంద్రాపురంలో 4, వడమాలపేటలో 4 దుకాణాలకు సంబంధించి ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడకు చెందిన ప్రియ కుమార్తె మోహిత(6) కాలేయవ్యాధితో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతోంది. చిన్నారి వైద్య ఖర్చులకు తల్లి ప్రియకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బాలాజీనాయుడు, రవినాయుడు, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి.వంశీధర్‌రెడ్డి రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు గురువారం అందించారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.



విరాళం అందిస్తున్న దాత వంశీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక



దేవరాజులునాయుడు

ఐరాల, న్యూస్‌టుడే: మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా జి.దేవరాజులునాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె.అరుణ్‌కుమార్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎం.సోమశేఖర్‌నాయుడు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా కె.ప్రభాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా లీలావతి, జనార్దన్, కోశాధికారిగా సుధాకర్, కార్యదర్శులుగా గుణసుందరి, నాగరాజు, కేశవులు, విజయలక్ష్మి, అమ్ములు, విజయప్రసాద్, రోజారాణి, ప్రదీప్ మాధవరెడ్డి, గాయత్రీ, జిల్లా కౌన్సిలర్లుగా రామచంద్రనాయుడు, వెంకటముని, సోమశేఖర్‌నాయుడు, అరుణ్‌కుమార్, దేవరాజులు, ఏకాంబరం, రామకృష్ణయ్య, వినోద్‌కుమార్, జ్యోతి, పూర్ణం, లీలావతి, సభ్యులుగా త్రివేణి, కుసుమకుమారి, ఆడిట్ సెల్ కమిటీ సభ్యులుగా సరోజమ్మను ఎన్నుకొన్నట్లు ఆయన వివరించారు.



నిరసన తెలుపుతున్న తపాలా శాఖ ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల నిరసన

బంగారుపాళ్యం: టార్గెట్ పేరుతో హించించడం ఆపాలని తపాలాశాఖ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. ఎన్ఎఫ్‌పీఎఫ్, ఏఐజీడీఎస్‌యూ యూనియన్ల పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంగారుపాళ్యం సబ్ పోస్టుమాస్టర్ మహేష్, డివిజినల్ కార్యదర్శి అరుణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పి.కొత్తకోట సీహెచ్‌సీ తనిఖీ

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ను జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను, ఓపీ, మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి అన్ని విభాగాలను క్షుణంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జి వైద్యాధికారి కుమారరాజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో ప్రభావతి దేవి

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



సోమల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలం లోని కందూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట్రమణారెడ్డి, పీడీ చిన్నప్ప గురువారం తెలిపారు. గంగవరం ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు, పీడీని ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఎస్సీ ఎస్టీ సమావేశం

శాంతిపురం: ఎస్సీ, ఎస్టీ అస్పృశ్యత నివారణ సమీక్ష సమావేశం ఈనెల 4న శుక్రవారం జరుగుతుందని తహసీల్దార్ శివయ్య తెలిపారు. మండల సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులు తోపాటు అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

రామకుప్పం, న్యూస్‌టుడే:
సమస్య: మండలంలోని విజలాపురం సచివాలయం పక్కనే రహదారిపై వర్షం నీరు నిలిచి ఇబ్బందిగా మారింది.
- గోపి, ప్రయాణికుడు, రామకుప్పం
సమాధానం: వెంటనే పరిశీలించి పంచాయతీ సిబ్బంది ని పంపి చర్యలు తీసుకుంటాం. - బాబు, ఈవోపీఆర్డీ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:
సమస్య: ఎన్నికల సమయంలో నిబంధనల్లో భాగంగా పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఉన్న శిలాఫలకానికి స్టిక్కర్లు అతికించారు. ఎన్నికలు పూర్తై కొత్తప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ తొలగించలేదు. - ఆర్యగం
సమాధానం: వెంటనే సిబ్బందితో తొలగించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. - శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం

పుంగనూరు (గ్రామీణ), న్యూస్‌టుడే:
సమస్య: బత్తలాపురంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కాలువలు శుభ్రం చేయాలి.
- రెడ్డెప్ప, బత్తలాపురం
సమాధానం: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం. సమస్య పరిష్కరిస్తాం - నారాయణరెడ్డి, సర్పంచి, నెక్కుంది

న్యూస్‌టుడే, పుంగనూరు:
సమస్య: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ మలుపులో నడి రోడ్డులో గొయ్యి పడింది. దీంతో ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఈ గొయ్యిని పూడ్చివేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రమాదాలను నివారించవచ్చు.
- నవీన్, వాహనదారుడు
సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపడతాం. - చంద్రశేఖర్, ఏఈ, ర.భ.శాఖ, పుంగనూరు

ఆదర్శ పురపాలికగా మార్చుదాం

వార్డుల ప్రగతిపై త్వరలో డ్రోన్ సర్వే



డ్రోన్ చూపిస్తున్న పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఆదర్శ పురపాలికగా కుప్పాన్ని మార్చేందుకు ప్రజలు సహకరించాలని పురపాలిక కమిషనర్ శ్రీనివాస రావు కోరారు. స్థానిక పురపాలిక కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. పురపాలిక పరిధిలోని అన్ని వార్డుల్లో చెత్తాచెదారం, మురుగు నీటి కాలువలపై పూర్తిస్థాయిలో డ్రోన్ ద్వారా నెల రోజుల పాటు సర్వే చేయనున్నట్లు తెలిపారు. మూడు నెలలు క్రితం పురపాలిక ఎలా ఉంది? ప్రస్తుతం ఎలా ఉందన్న విషయాలపై డ్రోన్ ద్వారా చిత్రాలు తీయనున్నట్లు చెప్పారు. వార్డుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. డ్రోన్ సర్వేలో భాగంగా రోడ్లపై చెత్త పారవేసే వారిని గుర్తించి, వారికి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. నెలకు జీతాల రూపంలో రూ.30 లక్షలు ఇవ్వాల్సి వస్తోందని, పన్నుల రూ.2.30 కోట్లు మాత్రమే ఆదాయం చేకూరుతోందన్నారు. కౌన్సిలర్లు దాము, సోము, సురేష్, సెల్వం పాల్గొన్నారు.

పేదోడి బియ్యం.. ఉన్నోడి ఆదాయం

- క్షేత్రస్థాయిలో ఏజెంట్లతో సేకరణ
- అక్రమంగా కర్ణాటకకు తరలింపు
- పాలిష్ చేసి సన్నబియ్యంగా విపణిలోకి

పలమనేరు, న్యూస్‌టుడే: దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలకు ప్రభుత్వం అందించే చౌక బియ్యం ఉన్నోళ్లకు ఆదాయ వనరుగా మారుతోంది. బియ్యం నాణ్యతా ప్రమాణాలపై మార్గదర్శకాలు లేకపోవడం, ఉన్నవి అమలు చేయడంలో అధికార యంత్రాంగం నిర్లిప్తత వెరసి వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాల్లోని మిల్లుల్లో పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చేసి బహిరంగ మార్కెట్లో వదిలేస్తున్నారు. వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కరోనా సమయంలో వైకాపా నాయకులు ఇంటింటికి ఉచితంగా ఇచ్చిన ఇలాంటి బియ్యమేనని విమర్శలున్నాయి.



ఇటీవల పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (పాతచిత్రం)

మచ్చుకు కొన్ని ఘటనలు

గతేడాది ఆగస్టులో వైకాపా ప్రభుత్వ హయాంలో నాయకనేరి వద్ద తమిళనాడు సరిహద్దులో బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిని గ్రామస్థులు పట్టుకున్నారు. ఆ ప్రైన తమిళనాడు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చే లోపు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. రవాణా చేస్తున్న వ్యక్తిని గ్రామస్థులు వి.కోట పోలీసులకు పట్టిచ్చారు. అయితే అప్పటి వైకాపా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో అతన్ని వదిలేశారు. బియ్యం స్వాధీనం చేసుకున్న తమిళ పోలీసులు నిందితుడి కోసం సంప్రదిస్తే.. వి.కోట పోలీసులు నుంచి సమాధానం కరవైంది. దీంతో తమిళనాడు పోలీసులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన తర్వాత ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

❖ గత నెలలో రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వ్యాన్‌ను పలమనేరు పోలీసులు పట్టుకున్నారు. అందులోని 10 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. అరగొండ నుంచి కర్ణాటకలోని బంగారుపేటకు రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ బియ్యానికి పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి తర్వాత మార్కెట్‌కు తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. కేసు పురోగతిలో ఉంది. పశ్చిమ ప్రాంతంలో చాలా మంది వ్యాపారులు ఈ దందా సాగిస్తున్నట్లు అనుమానాలున్నాయి.

క్షేత్రస్థాయిలో సేకరణ ఇలా..

పేదల కోసం ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూల వద్దే చాలా మంది లబ్ధిదారులు ఇచ్చేసేవారు. వాహనాల్లో కొందరు ఆపరేటర్లు దళారులుగా మారిపోయారు. వేలిముద్రలు వేయించి బియ్యం ఇచ్చినట్లు నమోదు చేసేవారు. వారికి కిలో రూ. 8-10 చొప్పున చెల్లించేవారు. తర్వాత వాటిని బల్క్ వ్యాపారులకు ఆదాయం చూసుకుని విక్రయించేవారు. మరి కొందరు క్షేత్రస్థాయిలో ఏజెంట్లను నియమించుకుని బియ్యం సేకరించేవారు. పట్టణానికి చెందిన వ్యాపారులు వాటిని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుంటారు. అక్కడ అదే బియ్యానికి పాలిష్ పెట్టి తిరిగి నాణ్యమైన సంచుల్లో నింపి సన్నబియ్యం పేరిట మన రాష్ట్రంలోకే పంపేస్తుంటారు.

తమిళనాడు బియ్యం సైతం..

చిత్తూరు, మదనపల్లె, తిరుపతి ప్రాంతాల్లో 25 కిలోల బస్తా రూ.1200- 1600 మధ్య ధర పలుకుతోంది. రేషన్ బియ్యాన్ని చిత్తూరు, అరగొండ, పీలేరు పలమనేరు ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. తమిళనాడు బియ్యం కూడా... అక్కడి పేదలకు ఉచితంగా సరఫరా చేసే బియ్యాన్ని వారి నుంచి కిలో రూ.5 చొప్పున కొంటారు. దాన్ని ఇక్కడి వ్యాపారులకు కిలో రూ.10 చొప్పున విక్రయిస్తారు. ఈ అంశంపై పలమనేరు తహసీల్దారు ఇన్బనాథన్ వివరణ కోరగా నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

పక్కాగా నిఘా.. పేదల బియ్యం కొనుగోలు చేస్తున్న విషయమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇందు కోసం ప్రత్యేక బృందాలు నియమిస్తాం.
-ప్రభాకర్, డీఎస్పీ, పలమనేరు

బేటరాయస్వామికొండకు ప్రత్యేక బస్సులు

కుప్పం (గ్రామీణ), న్యూస్‌టుడే: కుప్పం మండలం ఉర్లఓబనపల్లె సమీపంలోని శ్రీ బేటరాయస్వామికొండ వద్ద ఈనెల 5న తిరిదే ఆధ్వర్యంలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవానికి వివిధ మార్గాల్లో 10 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజరు సెంథిల్ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణానికి రూ.20గా టికెట్టు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

పుంగనూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: బాలిక అస్పియా అంజుమ్ తల్లిదండ్రులను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాష గురువారం పుంగనూరులో పరామర్శించారు. కుమార్తె మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారిని ఓదార్చారు. పోస్టుమార్టం ఆధారంగా త్వరలో పోలీసులు నిందితులను పట్టుకుంటారని, శిక్ష తప్పదని ఆయన పేర్కొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోనే నక్కబండలో కొన్ని వీధి దీపాలు వెలగకపోవడంతో పురపాలిక సిబ్బంది గురువారం మరమ్మతులు చేశారు. ఈనెల 2న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో ప్రచురితమైన సమస్యకు స్పందించారు. పురపాలక కమిషనర్ మధుసూదనరెడ్డి ఆదేశాలతో మరమ్మతులు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పోస్టల్ సిబ్బంది నిరసన

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట పోస్టల్ సిబ్బంది నిరసన తెలిపారు. గురువారం ఉదయం నుంచి వారు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తపాలా ఉద్యోగుల సంఘం పలమనేరు డివిజన్ కార్యదర్శి అరుణ మాట్లాడుతూ తమకిచ్చిన టార్గెట్స్ తగ్గించాలని కోరారు. ఇంకా పని భారం తగ్గించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎస్పీఎంతేజ, అస్లాంఖాన్, గోవిందు, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్వర్ణకవచ అలంకరణలో శ్రీసల్లాపురమ్మ



బైరెడ్డిపల్లె: స్వర్ణకవచ అలంకరణలో శ్రీసల్లాపురమ్మ



పుంగనూరు: ప్రత్యేకాలంకారంలో



రామకుప్పం: పసుపు అలంకరణలో..

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీసల్లాపురమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం స్వర్ణకవచ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు అమ్మవారికి అభిషేకం, స్వర్ణకవచ అలంకరణతో పూజలు జరిపారు. **పుంగనూరు:** నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పలు వీధుల్లో కొలువైన ఆలయాల్లో పూజలు జరిగాయి. ప్రధాన ఆలయాల్లో గురువారం ఉదయం నుంచే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. శక్తిదేవత ఆలయాలతో పాటు కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. **రామకుప్పం:** దేవీ నవరాత్రుల్లో భాగంగా గురువారం మండలంలోని ఆనిగానూరు లోని కన్యకా పరమేశ్వరి వాసవి కన్యకాపరమేశ్వరం దేవిని మొదటి రోజు పసుపు అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవంగా ధ్వజారోహణం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం గ్రామంలో వెలసిన శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో గురువారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణతో పూజలు జరిపారు. కలశ స్థాపన, ధ్వజారోహణం, మంటపోత్సవం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిఘా నేత్రాలకు మరమ్మతు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: మూడు రాష్ట్రాల కూడలి ప్రదేశమైన కుప్పంలో నేరాల నియంత్రణ కోసం నిఘా నేత్రాలు ఏర్పాటు చేసేందుకు ఎనిమిదేళ్ల క్రితం నియోజకవర్గ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే ఐదేళ్ల వైకాపా పాలనలో మరమ్మతులకు గురైనా పట్టించుకోకుండా వదిలేశారు. ఐదేళ్ల పాటు నిఘా నేత్రాలు పని చేయలేదు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టారు.



సీసీ కెమెరాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కిలో టమాటా రూ.65



స్థానిక టమాటా మార్కెట్‌కు వచ్చే దిగుబడులు క్రమంగా తగ్గుతున్నాయి. సాధారణంగా సెప్టెంబరు, అక్టోబరులో ఈ స్థాయిలో ధరలు తక్కువగా ఉంటాయి, దిగుబడులు తక్కువగానే ఉంటాయి. ఈ ఏడాది సీజన్ ముగిసినా ధరలు మాత్రం అమాంతం పెరుగుతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో, జిల్లాల్లో దిగుబడులు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. గురువారం టమాటా మార్కెట్‌కు 100టన్నులు రాగా 10 కిలోల టమాటా కనిష్ఠ ధర రూ.600. గరిష్ఠ ధర రూ.687, సరాసరి ధర రూ.650 పలికింది. ఈ ధరలతో రైతన్నలు హర్షిస్తున్నారు. -న్యూస్‌టుడే, పుంగనూరు

మేఘం.. స్వర్ణవర్ణ సోయగం



ప్రకృతిలో అరుదుగా కనిపించే దృశ్యాలు కళ్లను కట్టిపడేస్తుంటాయి. ఆకాశం మేఘావృతమైన సందర్భాల్లో అందాలు వర్ణశోభితంగా ఉంటాయి. కుప్పంలో గురువారం సాయంత్రం ఆకాశంలో మేఘం మెరిసినట్లుగా మిరుమిట్లు గొలిపే విధంగా చుట్టూ కాంతులు రావడం చూపరులకు కనువిందు చేసింది. అంతవరకు భగభగలాడిన భానుడు అంతలోనే మేఘం వెనుక దాక్కోవడంతో.. గగనతలంలో కొద్దిసేపు చూడచక్కని దృశ్యం ఆవిష్కృతమైంది. - న్యూస్‌టుడే, కుప్పం

ప్రారంభానికి రైతుబజార్ సిద్ధం



పట్టణంలోని వారపు సంతలో నూతనంగా నిర్మించిన రైతుబజార్‌ను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం నూతనంగా రైతుబజార్ మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వం పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణాన్ని రూ. 25 లక్షలతో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ప్రారంభించే తేదీని ఇంకా నిర్ణయించలేదని చిన్న చిన్న పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రకటిస్తామని మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు.
- న్యూస్‌టుడే, పలమనేరు

బస్‌షెల్టర్‌లో ఆక్రమణల తొలగింపు



పెద్దబదనవాడ కూడలి బస్‌షెల్టర్ ఆక్రమణలను అధికారులు తొలగించారు. సెప్టెంబర్ 29న 'ఆక్రమణలో బస్‌షెల్టర్' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. మండల తహసీల్దారు సీతారాం, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ స్పందించారు. వారి ఆదేశాలతో పెద్దబదనవాడ గ్రామ సచివాలయం అధికారుల బృందం ఆక్రమణల తొలగించే పనులపై దృష్టి సారించారు. షెల్టర్ వద్ద ఏర్పాటైన మంసం దుకాణాలు, షెల్టర్ పక్కనే అక్రమంగా వెలసిన రేకులషెడ్ తొలగించారు. వీఆర్వో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి గోవిందు కార్యాచరణలో పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, పెద్దబదనవాడ (గుడుపల్లె)

మద్యం దుకాణం మార్చాలి

సదుం, న్యూస్‌టుడే: ప్రధాన రహదారి బస్టాండులో ఉన్న మద్యం దుకాణాలు అక్కడ్నుంచి మరో ప్రదేశానికి మార్చాలని స్థానికులు డిమాండ్ చేశారు. నివాసాల మధ్య దుకాణం ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత వాసులు చెప్పారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

సదుం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి ఉషారాణి తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ జరిగింది. రైతులు ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. సీసీ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి హసీనా చెప్పారు. ఏపీడీ శ్రీనివాసులు, ఉపసర్పంచి మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కల్లూరు: పంటలకు నీరు పొదుపుగా వాడుకోవాలని, భావితరాలకు అందించాలని పుంగనూరు వ్యవసాయశాఖ ఉప సంచాలకులు శివకుమార్ సూచించారు. గురువారం మండలంలోని గడ్డంవారిపల్లె, మంగళంపేట పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శ్రీనివాసులు, పశు వైద్యాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శాంతిపురం: మండల పరిధి గుంజార్లపల్లె పంచాయతీ తుమ్మిశి కొత్తూరుకు చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త రామక్రిష్ణప్ప అనారోగ్యంతో గురువారం మరణించారు. ఆయన మృతి పట్ల పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఆనందరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

మిర్చి వ్యాపారిపై దాడి: నగదు అపహరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మిర్చి వ్యాపారిపై దాడిచేసి దోపిడీకి పాల్పడిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన బాషా గుంటూరు నుంచి మిర్చి కొనుగోలు చేసి తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. తన ఊరి నుంచి ఈ నెల 2న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గుంటూరుకు చేరుకున్నారు. మిర్చి యార్డుకు వెళ్లడానికి స్థానిక పల్నాడు బస్టాండ్ వద్ద ఆటో కోసం వేచి ఉండగా. అక్కడకు ఓ ఆటో వచ్చింది. అందులోని ఇద్దరు.. తాము మిర్చి యార్డుకు వెళ్తున్నామని చెప్పి ఆయన్ని ఎక్కించుకున్నారు. చుట్టుగుంట వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపి బాషాను కొట్టి బెదిరించి రూ.9,600 నగదు, చరవాణి చోరీ చేశారు. అక్కడ నుంచి ఆయన నడుచుకుంటూ వచ్చి గురువారం వేకువజామున నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రామీణ క్రీడలను కాపాడుకుందాం



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సమావేశమైన అసోసియేషన్ సభ్యులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: మరుగున పడుతున్న గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను కాపాడుకునేలా కుప్పం స్పోర్ట్స్, గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ సంఘ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సంఘ నాయకులు గోపీనాథ్, శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలో క్రీడా మైదానం కోసం తమ సంఘం ఆధ్వర్యంలో కృషి చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో క్రీడా మైదానాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని, క్రీడాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. నరేష్, రవి, మణి, లక్ష్మీపతి, పాండు పాల్గొన్నారు.

కూలీలందరికీ వంద రోజుల పని



గ్రామసభలో ప్రసంగిస్తున్న ఏపీడీ వెంకటరత్నం

శాంతిపురం, న్యూస్‌టుడే: కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఏపీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. కెనమాకులపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచి జయరామ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఉపాధి పనుల్లో జలసంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనారాయణ, తెదేపా బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇ. రమేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

శునకాలతో జనం బెంబేలు



మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో గుంపులుగా శునకాల సంచారంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో శునకాల బెడద మరింత అధికంగా ఉండడంతో రాకపోకలు సాగించాలంటే భయాందోళన చెందుతున్నారు. వృద్ధులు, చిన్నారుల వెంటబడి కరుస్తుండడంతో అంతా కలవరపడుతున్నారు. ద్విచక్రవాహనదారులను సైతం శునకాలు వెంబడించి కరుస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్లుగా కుక్కలకు సంతాన నిరోధక టీకాలు వేసి అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, సదుం

గమ్యం చేరాలంటే.. అవస్థలు పడాల్సిందే



పుంగనూరు- కర్ణాటక సరిహద్దు మార్గంలో పట్టణ పరిధి రాంనగర్ సమీపంలో రోడ్డు గోతుల మయమైంది. ఈ మార్గంలో భారీ వాహనాలతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఐతే ఈ గోతులతో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. వర్షపునీరు రోడ్డుపై నిల్వకుండా కాలువ ద్వారా చెరువులోకి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ గోతుల్లో దిగితేనే గమ్యం స్థానం చేరే పరిస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, పుంగనూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నచెల్లారగుంట మలుపు వద్ద బుధవారం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యుగంధర్‌గౌడు (47) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆకులకొత్తూరు గ్రామానికి చెందిన ఇతను నాలుగురోడ్ల కూడలి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మృతునికి భార్య భారతి, కుమార్తె చందన, కుమారుడు చక్రధర్ ఉన్నారు. యుగంధర్‌గౌడు తెదేపా వీరాభిమాని కావడంతో తెదేపా మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బేలుపల్లె పంచాయతీ తెదేపా నాయకులు నాగరాజు, ఫణి పరామర్శించి సంతాపం తెలిపారు.



యుగంధర్‌గౌడు (పాతచిత్రం)

వివాహిత అదృశ్యం

పుంగనూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన వివాహిత (22) సెప్టెంబర్ 24న నుంచి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు పది రోజులుగా వెతికామని ఎక్కడా ఆచూకీ దొరకకపోవడంతో గురువారం పోలీసులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ దామోదరం తెలిపారు.